అల్లుకున్న నిర్లక్ష్యం

- కరెంట్ పోల్స్ పైకి ఎగబాకిన మొక్కలు, పాదులు
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఇదే పరిస్థితి
- పొంచి ఉన్న ప్రమాదం • పట్టించుకోని అధికారులు


రైల్వేక్వార్టర్స్ సమీపంలో విద్యుత్ పోల్స్ కింది నుంచి పాకిన పిచ్చి పాదులు, మొక్కలు


కైలాసపురం జంక్షన్ బస్టాప్ సమీపంలో పోల్స్, వైర్లపై వ్యాపించిన పాదులు


విద్యుత్ వైర్లకు అన్ని వైపులా విస్తరించిన పాదులు


విద్యుత్ స్తంభం కూడా కనబడనంతగా అల్లుకున్న పాదులు

తాటిచెట్లపాలెం: విద్యుత్ స్తంభాలు, తీగలపై మొక్కలు, పాదులు దట్టంగా అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. పొరపాటున వాటి నుంచి కరెంట్ ప్రవహిస్తే తీరని నష్టం జరిగే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాటిచెట్లపాలెం నుంచి రైల్వేస్టేషన్ మార్గంలో చాలా చోట్ల ఈ విధంగా విద్యుత్ వైర్లను తాకుతూ పిచ్చి మొక్కలు వ్యాపించాయి. కొన్ని చోట్ల కింది నుంచి, మరి కొన్నిచోట్ల భూమిలో నుంచి బలమైన మొక్కలుగా ఈ పాదులు వ్యాపించాయి. వీటి మొదళ్లు కిందనే ఉండడంతో ఎవరైనా వాటిని తీయాలని చూసినా, వాటిని తాకినా అది ప్రమాదమే. వీటి నుంచి ఒకవేళ విద్యుత్ ప్రవాహం జరిగితే వైర్లు, పోల్స్ వద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ.

ప్రమాదకరంగా వైర్లు

కొన్నిచోట్ల ఈ పాదులు పోల్స్ వరకే పరిమితం కాగా.. మరికొన్ని చోట్ల పోల్స్‌ను దాటుకుని, విద్యుత్ వైర్లు కూడా అల్లేశాయి. వీటిని చూసిన వారికి అక్కడ విద్యుత్‌వైర్లు ఉన్నాయన్న సంగతే తెలియడం లేదు. అంతలా ఈ పాదులు అల్లేసుకున్నాయి. కైలాసపురం నుం చి మాధవధార వెళ్లే రోడ్‌లో కూడా చాలా చోట్ల ఈ విధంగా విద్యుత్ పోల్స్ మీదికి, వైర్ల మీదికి పిచ్చిమొక్కలు వ్యాపించాయి. కైలాసపురం జంక్షన్ బస్‌స్టాప్ సమీపంలో పాత పోస్టాఫీసు ఎదురుగా కూడా చాలా గుబురుగా ఎలక్ట్రికల్ పోల్స్, వైర్లను తాకుతూ పాదులు అల్లుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరుతున్నారు.

అంటుకుంటే పెను ప్రమాదం

కొన్ని చోట్ల ఇలా వ్యాపించిన పాదులు ఎండిపోయాయి. ఇవి కూడా ప్రమాదకరమే. పొరపాటున ఏమైనా మంటలు వ్యాపించినా, ఆకతాయిలు వీటి సమీపంలో అగ్ని రాజేసినా ఇవి వ్యాపించి పాదులకు, వైర్లకు అంటుకునే ప్రమాదం ఉంది. అటువంటి వాటిని కూడా తొలగించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీటిని తొలగించి విద్యుత్ పోల్స్ చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో దుర్గామాంబ అమ్మవారి ఆలయంలో మాఘ మాస శుద్ధ చవితి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ఈ పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

20న జోన్-3 కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడ్ మేళా

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో ఈ నెల 20న ఉదయం 11 గంటలకు సర్వీస్ ప్రొవైడ్ మేళా నిర్వహిస్తున్నట్లు జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ అనంతరం హోమ్ ట్రయాంగిల్ సంస్థ వారి యాప్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్లను ఆన్ బోర్డ్ చేస్తారని పేర్కొన్నారు. మొదటి దశలో వడ్రంగులు, ప్లంబింగ్ సేవలు, విద్యుత్ సేవలు, ఉపకరణాలు (వీటిలో ఏసీ, రిఫ్రిజిరేటర్/వాషింగ్ మెషీన్-వాటర్ ప్యూరిఫైయర్, గీజర్) ఉంటాయని తెలిపారు. సర్వీస్ ప్రొవైడర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు సందర్శిస్తారని తెలిపారు.

క్లుప్తంగా

'సెకీ' ఒప్పందాన్ని రద్దు చేయాలి

విశాఖ సిటీ: విద్యుత్ వినియోగదారులకు భారం కానున్న 'సెకీ' ఒప్పందాన్ని ఈఆర్‌సీ తక్షణం రద్దు చేయాలని ఈఆర్‌సీ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో చైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ వనరుల ప్రణాళికలో భాగంగా రాబోయే ఐదేళ్లలో 10,800 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్, 7 వేల మెగావాట్ల సెకీ విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల గ్రిడ్‌కు పునరుత్పాదక మిశ్రమం పెరుగుతుందన్నారు. దీనివల్ల నిర్వహణ కష్టతరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఆర్‌ఈసీఎస్‌లు రద్దవుతున్న నేపథ్యంలో కశింకోట, చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్‌లను యథావిధిగా ఈపీడీసీఎల్ పర్యవేక్షణలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు సలీం

సీతమ్మధార : మనస్తాపంతో ఒక వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన ఫోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. అక్కయ్యపాలెం, చిన్నూరు ప్రాంతానికి చెందిన ఎస్‌కే సలీం (32) భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఉన్నత చదువులు అభ్యసించినా సలీంకు ఉద్యోగం రాకపోవడంతో మాంసం వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో, గురువారం సాయంత్రం భార్య లోపల గదిలో పనిలో ఉండగా ముందు గదిలో లుంగీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటికి భార్య ఫరిన్ బయటకు వచ్చి చూసేసరికి సలీం గదిలో వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో కేకలు వేసింది. స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్- స్వచ్ఛ విశాఖ '

విశాఖ సిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ విశాఖ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం (18వ తేదీ) ఉదయం 10 గంటలకు సెంట్రల్ పార్క్ వద్ద, అనంతరం 11.30 గంటలకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలతో పాటు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సంస్థ నిర్వహణలో ఉన్న అన్ని పార్క్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని శత శాతం నిషేధించాలని ఆదేశించారు.

ఆహార పొట్లాల పంపిణీ


ఆహార పొట్లాలు అందజేస్తున్న నాయుడు

సీతంపేట: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గాడ్ మెస్సయ్య సంఘం ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో పేదలకు శుక్రవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సంఘం వ్యవస్థాపకుడు జి.కె.నాయుడు చేతుల మీదుగా మహిళలకు బిర్యానీ పాకెట్లు పంచిపెట్టారు. ప్రతీ శుక్రవారం 150 నుంచి 200 మందికి ఆహారం అందజేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఉజ్జీవ ఆశీర్వాద సభలు




ప్రసంగిస్తున్న పి.జె.స్టీఫెన్ పాల్, సభకు హాజరైన ఏసు ఆరాధకులు

సీతంపేట: పీజే స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ పి.జె.స్టీఫెన్‌పాల్, సిస్టర్ శైలాపాల్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఉజ్జీవ ఆశీర్వాద సభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుని ప్రేమ వర్షంలో మనం ఉంటే, ఈ లోకంలో ఉన్న ప్రతీ శ్రమను జయించి దేవుడిని ప్రత్యక్షంగా చూడగలమన్నారు. విశాఖ, వరంగల్, బెంగళూరు, ఖమ్మం, హైదరాబాదు, తూర్పు పశ్చిమ గోదావరి ప్రాంతల నుంచి ప్రజలు వేలాదిగా సభకు హాజరయ్యారు. శని, ఆదివారాలలో కూడా సభలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సెయిల్‌లో విలీనంతోనే స్టీల్‌ప్లాంట్‌కు భవిత


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రాంబాబు,మాజీ కార్పొరేటర్ ఈశ్వరమ్మ

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పూర్తిగా మనుగడ సాధించాలంటే సెయిల్‌లో విలీనం చేయాలని గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు,మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 1,389 రోజు కొనసాగింది. ఈసందర్భంగా రాంబాబు, ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కొంత మేర ఆర్థిక సమస్యల నుంచి బయటపడడానికి తాత్కాలిక ఉపశమనంగా ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ శాశ్వతమైన పరిష్కారం కాదని వారు చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, సొంత గనులు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బలమైన సంస్థగా ఎదుగుతుందని చెప్పారు. దీనిపైన కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదన్నారు. ఆర్థిక ప్యాకేజీ ఏ రూపంలో ఇస్తున్నారో స్పష్టం చేయలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించాలని.. అవసరమైన వసతులు కల్పించి పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. రిలేనిరాహార దీక్షలో గొలగాని అప్పారావు, ఎ. నూకేశ్వరరావు, భానుమూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తయినా నిరీక్షణే..

ప్రారంభానికి నోచుకోని కల్యాణమండపం, సామాజిక భవనం


సీతంపేట రెల్లివీధిలో కొత్తగా నిర్మించిన కల్యాణ మండపం


హిందూ ముస్లింకాలనీలో నిర్మించిన సామాజిక భవనం

సీతంపేట: నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా కల్యాణ మండపం, సామాజిక భవనం ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. ఈ భవనాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయా అని స్థానికులు నిరీక్షిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఉత్తర నియోజకవర్గంలో ప్రతి వార్డుల్లో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగాయి. ఎన్నికల ముందు మొదలైన కొన్ని అభివృద్ధి పనులు పూర్తయి నెలలు గడిచినా, ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క అభివృద్ధి పనీ ప్రారంభించ లేదు. కనీసం గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన నిర్మాణాలనైనా ప్రజలకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

రూ.కోటిన్నరతో కల్యాణ మండపం

జీవీఎంసీ 25వ వార్డులో సుమారు కోటిన్నర వ్యయంతో బీటీఆర్ నగర్ రెల్లి వీధిలో రెండంతస్తుల్లో విశాలమైన కల్యాణ మండపం నిర్మించారు. పనులు పూర్తయి దాదాపు ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

హిందూ ముస్లింల సామాజిక భవనం

స్థానిక సీతంపేట హిందూ ముస్లిం కాలనీలో శిథిలమైన సామాజిక భవనాన్ని తొలగించి, దాని స్థానంలో రెండంతస్తుల సామాజిక భవనం నిర్మించారు. కాలనీలో నివసిస్తున్న హిందూ ముస్లింల అవసరాల మేరకు సౌకర్యంగా ఉండేలా ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవనమూ ఇంకా అలంకారప్రాయంగానే మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, భవనాలు త్వరితగతిన ప్రారంభించి, అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పాలిథిన్ వస్తువులు స్వాధీనం

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో శానిటరీ సిబ్బంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం శానిటరీ సిబ్బంది, పలు సచివాలయాల సిబ్బంది విశాలాక్షినగర్‌లోని పాన్ షాపులు, టిఫిన్ సెంటర్లు తనిఖీ చేశారు. పలు షాపుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు సంబంధించిన కవర్లు, పేపరు కప్పులు, పేపరు ప్లేట్లు స్వాధీనం చేసుకొన్నారు. యజమాన్లకు జరిమానా విధించనున్నట్లు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు తెలిపారు.

లలితాపీఠంలో సంకటహర చతుర్థి


లలితాపీఠంలో హరిద్ర గణపతి హోమం చేస్తున్న పండితులు

సీతంపేట: సంకట హర చతుర్థి సందర్భంగా స్థానిక లలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పంచామృతాభిషేకాలు, అర్చన అనంతరం హరిద్ర గణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన తిథులలో చతుర్థి ఒకటని, మనుష్యులను కష్టాల నుంచి గట్టెక్కించే సంకటహర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ తెలిపారు. పీఠం అర్చకుల మంత్రోచ్చరణల మధ్య ధూప దీప నైవేద్యాలు సమర్పించి, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. గణపతి హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు. బహుళ అష్టమి సందర్భంగా ఈ నెల 21న మంగళవారం ఉదయం 9:30 గంటలకు చండీ హోమం, సాయంత్రం 7 గంటలకు కాలభైరవ హోమం జరుగుతుందని కృష్ణసేన్ తెలియజేశారు.

పార్కు అభివృద్ధికి నివేదిక ఇవ్వండి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- 25వ వార్డులో పర్యటన


25వ వార్డులో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్


రాజేంద్రనగర్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

సీతంపేట: జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ 25వ వార్డులో శుక్రవారం ఉదయం పర్యటించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి అపూర్వ ఆసుపత్రి, కనకమ్మవారి వీధి, రాజేంద్రనగర్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అపూర్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ప్రజల ఆహ్లాదం కోసం పార్కుగా అభివృద్ధి చెయ్యాలని డాక్టర్ ఎస్.ఏ.ఎస్.మూర్తి కమిషనర్ దృష్టికి తీసుకురాగా, పార్కు అభివృద్ధికి పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను కమిషనర్ ఆదేశించారు. అపూర్వ ఆసుపత్రి వద్ద ఉన్న స్థలంలో వ్యర్థాలు అధికంగా ఉన్నాయని, వాటిని తొలగించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

➡ కనకమ్మ వారి వీధి వద్ద ఉన్న సులాభ్ కాంప్లెక్సును పరిశీలించి రోజుకు ఎంతమంది ప్రజలు సులాభ్ కాంప్లెక్సును వినియోగిస్తున్నారో ఆరా తీశారు. మరమ్మతులకు, మౌలిక సదుపాయాలకు నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

➡ రెల్లి వీధి నుంచి బుల్లయ్య కళాశాల రోడ్‌కు రహదారి అనుసంధానం చేయాలని కార్పొరేటర్ కోరగా, రహదారి స్థలం హెల్త్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్నందున రోడ్డు విస్తరణకు వారికి లేఖ పంపాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

➡ పక్కనే ఉన్న అన్నా క్యాంటీన్‌ను సందర్శించి, నిత్యం ఎంతమంది పేదలు భోజనం చేస్తున్నారని ఆరా తీశారు. పక్కనే ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఉన్నందున రోజూ 400 మంది అన్నా క్యాంటీన్‌కు వస్తున్నారని సిబ్బంది తెలిపారు. వృద్ధులకు, వైద్యానికి వస్తున్న రోగులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చెయ్యాలని కమిషనర్ ఆదేశించారు.

➡ వార్డులో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించడం లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదనరావు, ఏఎంవోహెచ్ బి.ప్రసాదరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బుట్టబొమ్మా...బుట్టబొమ్మా..


ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కళారూపాలు


ఆకట్టుకుంటున్న ప్రతిమలు


కళారూపాల వద్ద సందర్శకులు

ఏయూక్యాంపస్: బుట్టబొమ్మా...బుట్టబొమ్మా అంటూ సినిమా పాట గుర్తుకు తెస్తున్నాయి ఈ బొమ్మలు. బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ వెనుక మైదానంలో ఏర్పాటు చేసిన విశాఖ ఎక్స్‌పో సందర్శకులను కట్టిపడేస్తుంది. భారతీయ మహిళలు, సంప్రదాయ వస్త్రధారణ, ఎడ్లబళ్లు,గ్రామీణ ఇళ్లను తలపిస్తూ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ప్రవేశ ద్వారం సెట్ ఎంతగానో ఆకట్టుకుంటోంది. కళాకారులు ఎంతో నైపుణ్యంతో ఈ శిల్పాలను, సెట్‌ను నిర్మించారు. మహేష్ బాబు నటించిన శ్రీమంతుడు సినిమాలో దుబాయ్ వెళ్లి సెంటే తెచ్చా....జపాన్ వెళ్లి పౌడర్ తెచ్చా... అంటూ సాగే ఈ పాట సెట్‌ను పూర్తిగా ఇక్కడ యథాతథంగా నిర్మించడం విశేషం. దాదాపు 15 రోజులు కళాకారులు శ్రమించి ఈ సెట్‌ను తయారు చేసి ఇక్కడ ఏర్పాటు చేశారు.

మంచుకొండల్లో విహరించే అనుభూతి

ఎగ్జిబిషన్ లోపల ఏర్పాటు చేసిన కశ్మీర్ సిటీ ప్రత్యేక సెట్‌లు, మంచుకొండల్లో విహరిస్తున్నామనే భ్రమను కలిగించే విధంగా ఉన్నాయి.కొండలపై నుంచి నిరంతరం ప్రవహించే జలపాతం, పక్కనే ఆకుపచ్చని యాపిల్ చెట్లు, మంచుతో కప్పబడిన ఇళ్లు ఎంతో సహజత్వంతో ఆకట్టుకుంటున్నాయి. నగరవాసులు, పర్యాటకులు ఫొటోలు తీసుకుంటూ రీల్స్ చేస్తూ సందడి చేస్తున్నారు. ఈ భారీ సెట్ నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన కశ్మీర్ సిటీ నమూనా


కశ్మీర్ అందాలు..

ప్రమాదకరంగా కల్వర్టు


గురుద్వార్ వెనుక రోడ్డులో కల్వర్టు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గురుద్వార్ సాధ్ సంగత్ వెనుక రోడ్డులో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రాత్రివేళల్లో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం రోడ్డు నుంచి గురుద్వార్‌కు వచ్చే మార్గంలో ఈ కల్వర్టు ఉంది. అటు వైపు నుంచి వచ్చే వాహనచోదకులకు ఈ కల్వర్టు ఒక వైపు కనిపించకపోవడంతో రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి. జీవీఎంసీ జోన్-3 ఇంజినీరింగ్ అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.